పేరుకు ఉచితం.. సాగేది అక్రమం !

- మండలంలో ఇష్టానురీతిగా ఇసుక తరలింపు
- ట్రాక్టర్లు, లారీల నుంచి రాత్రి వేళలో ఇతర ప్రాంతాలకు రవాణా
- టీడీపీ నేతల చేతుల్లోకి ప్రజాధనం
- టన్ను ఇసుక రూ.900 నుంచి రూ.1100 వరకు వసూలు


అట్లేరు నుంచి ట్రాక్టర్ ద్వారా ఇసుక తరలింపు (ఫైల్)


మర్రిపూడి మండలం వైపు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్


పోటాపోటీగా వెళ్తున్న ఇసుక టిప్పర్లు

కొండపి:

ఇసుక ఉచితం.. ఇసుక ఉచితం. ఎక్కడినుంచైనా ఉచితంగా ఇసుకను తీసుకెళ్లొచ్చు తమ్ముళ్లు అంటూ కూటమి సీఎం చంద్రబాబు నాయుడు ఊదరగొట్టారు. కాని క్షేత్రస్థాయిలో ఎక్కడా కూడా ఇసుక ఉచితంగా అందించిన దాఖలాలు లేవని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని రోజుల పాటు ఉచిత ఇసుక ఇస్తున్నట్లు నానా హంగామా చేశారు. ఉచిత ఇసుక మాటున టీడీపీ నాయకులు ఇసుకను అమ్ముకుంటూ తమ జేబులను నింపుకుంటున్నారు. ప్రకృతి సమతుల్యాన్ని దెబ్బ తీసే విధంగా నదుల నుంచి ఇసుకను ఇష్టాను రీతిగా తవ్వేస్తున్నారు. దీనివలన భూగర్భ జలాలు ఇంకిపోతున్నా ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. జరుగుమల్లి మండలం పొన్నలూరు మండలంలో ఉన్న పాలేరు వాగు నుంచి రాత్రివేళలో లారీలు ట్రాక్టర్లకు జేసీబీతో ఇసుకను నింపి ఇతర మండలాలకు అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారు. ఈ ఇసుక అక్రమ రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ఇసుక వ్యాపారస్తులు తమ జేబులను నింపుకుంటున్నారు.

రాత్రి వేళలో జోరుగా ఇసుక రవాణా.

గత కొన్ని నెలల క్రితం ఇసుక వ్యాపారంపై పాలేరుకు సమీపంలోని రెండు గ్రామాల టీడీపీ నాయకుల మధ్య వివాదం చోటు చేసుకోవడంతో కొన్ని రోజులపాటు ఇసుక రవాణాను నిలిపివేశారు. అనంతరం గత రెండు నెలలుగా ఇసుక వ్యాపారాన్ని ప్రారంభించి టీడీపీ నేతలు జేబులు నింపుకుంటున్నారు. పగలురాత్రి తేడా లేకుండా మండలం నుంచి యథేచ్ఛగా ట్రాక్టర్ల ద్వారా ట్రిప్పర్ల ద్వారా కొండపి మండలానికి, మండలం మీదుగా మర్రిపూడి, చీమకుర్తి, సంతనూతలపాడు, టంగుటూరు మండలాలకు ఇసుక అక్రమ రవాణాను సాగిస్తున్నారు. టన్ను ఇసుక రూ.900 నుంచి రూ.1100 వరకు వసూలు చేస్తూ అమ్ముకుంటున్నారు. దాదాపు ప్రతిరోజు సుమారు 50 నుంచి 70 ట్రిప్పులు తీసుకొని కొండపి మీదుగా తరలిస్తున్నారు.

జేసీబీ యజమానులు కూడా ఇసుక రవాణా.

కొండపిలోని అట్లేరు సమీపంలో కొంతమంది జేసీబీ యజమానులు తమ సొంత జేసీబీలతో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇంటి మెరకకు అవసరమయ్యే గలుగు ఇసుక సైతం ట్రిప్పు రూ.1500 నుంచి రూ.2500 వరకు వసూలు చేస్తున్నారు. మండలంలో ఎక్కడ ఇసుక రీచ్ లేకపోయినా నాయకుల అండ చూసుకొని అట్లేరు, ముసి ప్రాంతంలోని ఇసుకను జోరుగా రవాణా చేస్తూ సంపాదనలో మునిగితేలుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టి, రోడ్లు ధ్వంసం కాకుండా, ఇసుకను ఉచితంగా అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

> **ఇసుకను ఉచితంగా అందించాలి...**
>
> 
>
> కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత ఇసుకను అందిస్తామని హామీ ఇచ్చారు. కొన్ని రోజులు అందించిన ఆ తర్వాత టీడీపీ నాయకులు దానిని వ్యాపారంగా మలుచుకున్నారు. ప్రభుత్వంలోని పార్టీదారులు ఇసుకను యథేచ్ఛగా అమ్ముకుంటున్నారు. పాలేరు నుంచి ఇసుకను కొండపి మండలంలోనికి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఉచిత ఇసుక ఇస్తానన్న మాట ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి.
>
> – బచ్చల కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ, మండల కన్వీనర్

క్లుప్తంగా

కనిగిరి డిపో నుంచి పాకలకు ప్రత్యేక బస్సులు


ఎం సయాన బేగం (డీఎం, కనిగిరి)

కనిగిరిరూరల్: కార్తీక మాసం సందర్భంగా ప్రజల సౌకర్యార్థం కనిగిరి నుంచి పాకాల సముద్ర తీరానికి అక్టోబర్ 19, 26 తేదీల్లో, నవంబర్ 2, 9, 16 తేదీల్లో కనిగిరి నుంచి పాకలకు ప్రత్యేక బస్సులు నడుపుతునట్లు ఆర్టీసీ డీఎం మహమ్మద్ సయనా బేగం తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. బస్సులు ప్రతి ఆదివారం ఉదయం 7:15, గంటలకు, 8:15 గంటలకు, మధ్యాహ్నం 12:15, గంటలకు 13:15 గంటలకు కనిగిరి బస్టాండ్ నుంచి బయలుదేరి కందుకూరు మీదుగా పాకల చేరుతాయన్నారు. కనిగిరి నుంచి పాకాలకు చార్జి రూ.80 మాత్రమే అని తెలిపారు. ఈ బస్సుల్లో స్త్రీ శక్తి పథకం అమలులో ఉంటుందని, మహిళలు సద్వినియోగం చేసుకోవచ్చునన్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని ఆర్టీసీ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ


అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో కృష్ణారావు

పీసీపల్లి: మండల పరిధిలోని పెద్ద అలవలపాడు ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో కృష్ణారావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. అనంతరం స్థానిక అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేయాలన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి


కిరాణా షాపును తనిఖీ చేస్తున్న ఎస్సై మాధవరావు

హనుమంతునిపాడు: అనుమతి లేకుండా దీపావళి సామగ్రి అమ్మితే చర్యలు తీసుకుంటామని ఎస్సై కె.మాధవరావు అన్నారు. శుక్రవారం హనుమంతునిపాడు, వేములపాడు, బస్టాండ్ సెంటర్లలో ఉన్న చిల్లర దుకాణాలు, కిరాణ షాపులు, బంకుల్లో అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వేములపాడు, కంభం, కనిగిరి హనుమంతునిపాడు రహదారిలో వాహనాలను తనిఖీ చేశారు.

సీజేఐపై దాడి అమానుషం


నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పీసీపల్లి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేయడం అమానుషమని ఎమ్మార్పీఎస్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు నేలపాటి రాజు మాదిగ అన్నారు. శుక్రవారం సీజేఐపై దాడి చేయడాన్ని ఖండిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేసి అర్జీ అందజేశారు. కార్యక్రమంలో కోటయ్య మాదిగ, రోజెస్ మాదిగ, సుధీర్ మాదిగ అత్యాల హానోక్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సైన్స్ సెమినార్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ


నిహారికను అభినందిస్తున్న హెచ్‌ఎం వెంకటేశ్వర్లు

టంగుటూరు: జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ పోటీల్లో మండలంలోని ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ చాటాడు. శుక్రవారం ఒంగోలులోని డీఆర్ఎం మున్సిపల్ స్కూల్లో జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థి నిహారిక జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించింది. ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థిని నిహారికను గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయులు అన్నపూర్ణను హెచ్‌ఎం వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారు.

పేదలకు వైద్యం అందకూడదనే కూటమి కుట్ర


సంతకాలు సేకరిస్తున్న మండల కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి, బలరామిరెడ్డి

హనుమంతునిపాడు: పేదలకు వైద్య విద్య దూరం చేయాలనే దుర్మార్గ చర్యలకు పాల్పడుతుంది కూటమి సీఎం చంద్రబాబేనని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసురెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల పరిధి కొండారెడ్డిపల్లి గ్రామంలో కోటి సంతకాల సేకరణలో భాగంగా రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలకు ఉచితంగా విద్య వైద్య అందించేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 17 మెడికల్ కాలేజీలు నిర్మాణం చేపడితే, వాటిని కూటమి ప్రభుత్వం దురుద్దేశంతో ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. మళ్లీ తిరిగి ప్రభుత్వం కాలేజీలను చేపట్టేంతవరకు ఉద్యమిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రైతు ప్రధాన కార్యదర్శి శ్యామల సాంబిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, సర్పంచ్ సంఘ అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ, రుద్రపాటి శోభ సాల్మన్ రాజు, ఎంపీటీసీ సూరిశెట్టి నారాయణ స్వామి, బీసీ మండల నాయకులు మద్ది తిరుపతయ్య, కేతిబోయిన వెంకటశాశయ్య, కలకాయ నారాయణ, ఎస్సీ సెల్ మండల నాయకులు బూతపాటి వెలుగొండయ్య, కస్తాల బాలాజీ, సర్పంచ్ కలుకూరి చిన్న, వెంకటేశ్వర్లు, బోయేజు, ఉస్తేల రాజారావు, కొండంరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కనిగిరిలో కోటి సంతకాల సేకరణ


సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల

కనిగిరి రూరల్: కనిగిరి మున్సిపాలిటీ 20వ వార్డులో నేడు శనివారం ఉదయం 07 గంటలకు నిర్వహించనున్న కోటిసంతకాల సేకరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం కనిగిరి మున్సిపాలిటీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పేదలకు వైద్యం, పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరంచేసే ఈ కుట్రను ప్రతి ఒక్కరు తిప్పికొట్టి, ప్రభుత్వంపై ఒత్తిడితెచ్చి వైద్యకళాశాలలను ప్రైవేటీకరణ కాకుండా చూడాలనే ఈ కోటిసంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ షేక్.అబ్దుల్ గఫార్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు, వైస్ చైర్మన్ పులి శాంతి, చింతం శ్రీనివాసులు, పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ వివిధ విభాగాల నాయకులు రాచపూడి మాణిక్యరావు, సిరుప గోవర్ధన్‌రెడ్డి, ఎ.నాగమణి, యర్రబల్లి దేవరాజు, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, ముల్లంగి శ్రీహరిరెడ్డి, చింతగుంట్ల కిషోర్‌బాబు, ఎస్.కృష్ణారావు, బచ్చు వెంగళరావుగుప్తా, షేక్.పోలిచర్ల రహీంబాషా, బాపట్ల కొండలరావు, పలుకూరి భాస్కర్, బొట్టు శ్రీను, కస్నేటి సుబ్బారెడ్డి, వై.కృష్ణారెడ్డి, గోవింద్‌రెడ్డి, పోతిరెడ్డి, రమణారెడ్డి, షేక్.షకీల, మద్దిశెట్టి భారతి, ఆర్.సుస్మిత పలువురు పాల్గొన్నారు.

నాణ్యమైన బేళ్లకే అధిక ధర


కొండపిలో వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి సునీల్ కుమార్


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారి శ్రీనివాసరావు

కొండపి: నాణ్యమైన బేళ్లకే అధిక ధర లభిస్తుందని వేలం నిర్వహణాధికారి సునీల్ కుమార్ తెలిపారు. శుక్రవారం వేలం సందర్భంగా రైతులకు పలు సూచనలను సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా జాగ్రత్తలో తీసుకోవాలన్నారు. క్లస్టర్ పరిధిలోని గుర్రప్పడియ, మూగచింతల, నెన్నూరుపాడు, చతుకుపాడు, కే.అగ్రహారం గ్రామాలకు చెందిన రైతులు 1386 బేళ్లను వేలానికి తీసుకురాగా 1122 బేళ్లు కొనుగోలు అయ్యాయి. వ్యాపారుల వివిధ కారణాలతో 264 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ 316, కనిష్ట ధర కేజీ రూ.70 సరాసరి ధర కేజీ రూ 227.09గా నమోదైంది.

పొగాకు కనిష్ట ధర కేజీ రూ.70

టంగుటూరు: వేలంలో పొగాకు కనిష్ట ధర కేజీ రూ.70 పలికిందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కారుమంచి, ఎం.నిడమాలూరు గ్రామాలకు చెందిన 851 బేళ్లను వేలానికి తీసుకురాగా 595 బేళ్లు కొనుగోలు అయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 256 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.316, సరాసరి ధర కేజీ రూ 163.82 గా నమోదైంది.

ఏళ్లనాటి చెట్ల నరికివేత


మొద్దులను ట్రాక్టర్‌కు ఎక్కిస్తున్న కూలీలు

టంగుటూరు: చెట్లు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి అంటూ ప్రతి నిత్యం మాట్లాడుకుంటూనే ఉంటాం. అందుకు అధికారులు సైతం ఊదరగొట్టి చెప్తుంటారు. కాని వారు మాత్రం పాటించరు. వివరాల్లోకి వెళ్తే.. జమ్ములపాలెం కాకుటూరిపాలెం గ్రామాల మధ్యలో నూతన విద్యుత్ లాగడానికి విద్యుత్ అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఆర్‌అండ్‌బీ పరిధిలోని రోడ్డుకు ఇరువైపులనున్న ఏళ్లనాటి చెట్లను నరికి వేశారు. ప్రయాణం చేసే సమయంలో చెట్ల వలన ప్రశాంతమైన గాలిని ఆస్వాదిస్తూ ప్రయాణం చేసే వాహనదారులకు ఎండ వేడిమితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందులో భాగంగా ప్రకృతి ప్రేమికులు చెట్లను నరికి వేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు. చెట్లను నరికి వేసిన తర్వాత ఉన్న మొద్దులను, కొమ్మలను పంచాయతీ సెక్రటరీ, అధికారులు, విద్యుత్ అధికారులు వచ్చిన నగదును తమ సొంత జేబులోనికి మళ్లించుకున్నారని ప్రజల గుసగుసలాడుకుంటున్నారు.

గేదెను ఢీకొన్న బైక్

సీఎస్‌పురం(పామూరు): అడ్డుగా వచ్చిన గేదెను మోటార్‌బైక్ ఢీకొన్న ఘటనలో మోటార్‌బైక్‌పై ఉన్న ఇరువురికి గాయాలయ్యాయి. ఈఘటన మండలంలోని కంభంపాడు జంక్షన్ సమీపంలో శుక్రవారం 167–బీ మైదుకూరు సింగరాయకొండ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండల కేంద్రం సీఎస్‌పురానికి చెందిన బందారు నితిన్, బందారు బండారు భార్గవ్ ఇరువురు తమ సొంతపనిమీద బైక్‌పై పామూరుకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈసందర్భంలో కంభంపాడు జంక్షన్ సమీపంలో ఒక్కసారిగా బైక్‌కు గేదె అడ్డురావడంతో బైక్ గేదెను ఢీకొని వారు కిందపడి గాయాలపాలయ్యారు. ఆసందర్భంలో సీఎస్‌పురం నుంచి పామూరుకు వెళ్తున్న సీఎస్‌పురం సీసీ మస్తాన్‌రెడ్డి ప్రమాదాన్ని గమనించి సాయం చేశారు. అదేవిధంగా 108 వాహనానికి కాల్‌చేసి సీఎస్‌పురం వైద్యశాలకు పంపారు.

ప్రభుత్వాలు పత్రికా స్వేచ్ఛను కాపాడాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

కొండపి: ప్రభుత్వాలు పత్రికా స్వేచ్ఛను కాపాడాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకుడు ఆరికట్ల లింగయ్య నాయుడు అన్నారు. శుక్రవారం జర్నలిస్టుల ఆధ్వర్యంలో సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి పై ఇతర రిపోర్టర్లపై బనాయించిన కేసులపై తహసీల్దార్ శీలం శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలపై ప్రభుత్వాలు ఆంక్షలు విధించకూడదని, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా పత్రికలు పనిచేస్తాయన్నారు. సాక్షి ఎడిటర్, రిపోర్టర్లపై బనయించిన అక్రమ కేసులను వెనువెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాసరావు, శివ, ఆరికట్ల శివ రాకేష్ వర్మ, గణేష్, నిరీక్షణ్ కుమార్, తదితర రిపోర్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ


క్రీడా దుస్తులతో కాకర్ల విద్యార్థులు

మర్రిపూడి: విద్యార్థులకు దాతలు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. మండలంలోని కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గుంటూరు హైజాక్‌బాబు తన తండ్రి పిచ్చయ్య, అలాగే తెలుగు ఉపాధ్యాయుడు మేకం సదానందం తల్లి రామసీత జ్ఞాపకార్థం సుమారు రూ. 20 వేలు విలువచేసే క్రీడా దుస్తులను శుక్రవారం విద్యార్థులకు బహూకరించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం


మాట్లాడుతున్న మున్సిపాల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్.అబ్దుల్ గఫార్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపాలిటీ పరిధిలోని ముక్కు కాశిరెడ్డి నగర్‌లో కనిగిరి మండల న్యాయ న్యాయ సేవాధికార సంస్థ గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదరిక నిర్మూలనపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా చైర్మన్ గఫార్ గఫార్ మాట్లాడుతూ పేద కుటుంబాల పిల్లలు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను వినియోగించుకుని విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. పేద పిల్లలకు విద్య అందించడంతో భవిష్యత్తులో వారికి ఆర్థిక ఆదాయం పెరిగి పేదరికం, నిరుద్యోగం తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పారాలీగల్ వలంటీర్, బంగారు బాల్యం కమిటీ సభ్యులు, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్‌బాబు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



విద్యుత్ శాఖ కార్యాలయం సమీపంలో ధర్నా చేస్తున్న కార్మికులు

కనిగిరిరూరల్: సమస్యల పరిష్కారం కోరుతూ విద్యుత్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదురు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ కనిగిరి మండల కమిటీ అధ్యక్షుడు పి.నరేంద్ర మాట్లాడుతూ.. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. 2022 పీఆర్సీ ఎరియర్స్ ఇవ్వాలన్నారు. జీతాల్లో వ్యత్యాసాలు లేకుండా అందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బిల్‌కలెక్టర్లు, స్టోర్ హమాలీలు, మీటర్ రీడర్లు, ఎస్పిఎంలకు కనీస వేతనాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, మార్క్, గురవయ్య, వేణుగోపాల్, హజరత్, మాల్యాద్రి, శ్రీను పాల్గొన్నారు.